# మళ్ళీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి

'పట్నం నుంచి బస్సొస్తుంది!'

'ఎప్పుడూ?'

'ఇయ్యాళే, పన్నెండు గంటలవేళ'

'ఓలమ్మ బస్సే! ఇంజను బస్సా?'

'మరే! డైవోరు చక్రం తిప్పితే పట్నం నుంచి ఇక్కడికొచ్చి వాలిపోతది.'

అంటే గాలిలో ఎగురుకుంటా వస్తదా?'

'నేలమీదే పరుగెత్తుతాది కాని, గాలిలో ఎగిరినట్టుంటది.'

'ఓలమ్మ బస్సొస్తందేవ్!'

'ఓరయ్య ఇంజను బస్సురోవ్!'

పట్నం నుంచి బస్సు వస్తుందన్న వార్త చిచ్చులా నిమిషాల మీద వూరంతా పాకిపోయింది. నీలాటి రేవులో ఇదే చర్చ. మాలక్ష్మమ్మవారి చెట్టు దగ్గర, పల్లవీథిలో, మిట్టమీద, గొల్లపాలెం, సాలెపేట అంతా రాబోయే బస్సు గురించే కబుర్లు. ఈ వార్త పొలాలకి కూడా పాకింది. వూరంతా అట్టుడికినట్టుడికిపోతోంది.

బస్సొస్తంది... బస్సొస్తంది......

చింతలచెట్టు రేవులో బట్టలుతుక్కోటాని కొచ్చిన ఆడవాళ్ళు కచ్చాపచ్చాగా తడిగుడ్డల్తో గబగబా ఇళ్ళకెళ్ళిపోయారు. చాకలాళ్ళు ఆ రోజు రేవు కట్టేశారు. సాలెపేటలో మగ్గా లాగిపోయాయి. రేవుపడవకి జనంలేరు. పిల్లలు బళ్ళు ఎగ్గొట్టేశారు. పొలాలమీద కూలిజనం పనులాపేసి పరుగెత్తుకొచ్చారు.

ఇళ్ళలో ఆడవాళ్ళు వంటలు ఆదరాబాదరాగా చేసి అన్నాలు పెట్టేశారు. పిల్లలు "నా కొత్తలాగూ ఎక్కడే?... నా పట్టు పరికిణీ ఇవ్వవే" అంటున్నారు. పెద్దలు చలవ పంచలు తీసి కట్టారు. ఆడవాళ్ళు జడలో పూలు తురుముకొని వడ్డాణాలు పెట్టారు. ఇంకా పన్నెండు కాకమునుపే ఇళ్ళకు తాళాలువేసి, అందరిళ్ళలో జనాన్ని పిలుచుకుంటూ వూరేగింపుగా పెద్ద బజార్లో కొచ్చారు.

వూరు వూరంతా పోలేరమ్మ జాతరలా కదిలివచ్చింది. పెద్దబజారు కిరుపక్కలా తొక్కిసలాడుకుంటూ జనం. ఆ జనం మధ్య చోటు చేసుకుంటూ సుబ్బయ్య, వీరయ్య చక్కిలాలు, ఉప్పుశనగలు పోటీగా అమ్ముతున్నారు. సందులో సందు జనమంతా కూడారు కాబట్టి గారడీవాడు ఆట ఆరంభించాడు. కాని జనం దృష్టి ఆటమీద లేదు, ఆ బస్సు గురించే ఆలోచనలు.

మన చిన్న రథమంత ఉంటదంటావా?"

"రెండు గడ్డిబళ్ళంత పొడుగయ్యా"

"ఓరమ్మ బస్సో"

"ఓరయ్య బస్సో!"

"అద్‌గద్‌గద్గో బస్సు"

జనమంతా ఒక్కుమ్మడిగా లేచిపోయారు. పిల్లలు తండ్రుల బుజాలెక్కారు. గారడీవాడి ఆట ఆగిపోయింది.

"వుహోయ్... హోయ్..." కేకలు.

అబ్బే! బస్సు రాలేదు. చూసి చూసి మళ్ళీ నేలమీద కూలబడ్డారు. ఎండ మాడుతోంది. చమటలు కారుతున్నాయి. రోడ్డువైపే అందరి కళ్ళు. అందరి ఆలోచనలు ఆ బస్సు గురించే.

దూరంగా "పాయ్... పపాయ్," అందరి వొళ్ళు జల్లుమంది. అలాంటి కూత వాళ్ళెప్పుడూ వినలేదు. దిగ్గున లేచి మంచున్నారు పసిపిల్ల బాలాది. "పాయ్... పపాయ్" ఆ కూత మరీ దగ్గరకొచ్చింది. విజయశంఖంలా వుంది ఆ కూత. దుమ్ము రేగింది. జనం తోసుకుంటున్నారు. కాళ్ళు తొక్కుకుంటున్నారు. బస్సొచ్చింది.

అద్గో బస్సు!

అద్గద్గో బస్సు!

బస్సుని చుట్టుముట్టేశారు వూరంతా. ఆశ్చర్యంతో కళ్ళు విప్పుకు చూస్తున్నారు. అందరి ముఖాలలో గొప్ప సంతోషం. ప్రపంచంలో అతి విలువైన వస్తువు వాళ్ళ వూళ్ళోకొచ్చినట్టు ఆ కళ్ళలో మెరుపు. అట్లాంటి సమయంలో బస్సులోంచి దిగాడు డ్రైవరు. ఏమి ఠీవిగా దిగాడు! యుద్ధంలో జయించి వచ్చిన అర్జునుడులా దిగాడు. ఒక్కసారి జనాన్నంతా విలాసంగా కలయజూశాడు. అందరివైపు చిరునవ్వులు నవ్వాడు. చూస్తున్న జనానికి దిగ్భ్రమ కలిగింది. మరో లోకంలోంచి దిగివచ్చిన అపూర్వ వ్యక్తిని చూచినట్టు చూస్తున్నారు. డ్రైవర్ ఒక హోదాగా నెత్తినున్న టోపి తీసి 'ఉస్'అన్నాడు. చూస్తున్న జనం కుతకుత లాడిపోయారు. పక్కనున్నవాళ్ళు ఉత్తరీయాలతో అతని




చెమట అద్దారు. పిల్లలు అతని కాకీ యూనిఫారం తాకి "అబ్బో"అనితెల్లబోతున్నారు.

"ఇక్కడేదన్నా భోజన హోటల్ వుందా?" అన్నాడు.

"అయ్యో! తమకి పప్పూ, పచ్చడీ పెడ్తామా? మిలిట్రీ హోటల్‌లో భోజనం-రండి." అంటూ జనం డ్రైవరుగార్ని ముందుకు నడిపించారు. గార్డ్ ఆఫ్ ఆనర్ అందుకుంటున్నట్టు ఆ జనం మధ్య నుంచి డ్రైవర్‌గారు ముందుకు నడిచాడు. ఆడవాళ్ళు, పిల్లలు బస్సు తాకి చూస్తుంటే కండక్టరు, క్లీనర్ జనాన్ని అదుపు చేస్తున్నారు. పిల్లలు బస్సులో ఒక్కసారి కూర్చున్నందుకు క్లీనర్ దమ్మిడీ దమ్మిడీ వసూలు చేస్తున్నాడు.

ఆ వూళ్ళో ఇంతటి ఆనందోత్సవంలో పాలుపంచుకోనివాడు ఒక్కడే. అతను జట్కా సాయిబు. పక్కసందులో జట్కా నిలబెట్టి ఈ జాతరంతా చూస్తున్నాడు. ఆ డ్రైవర్‌గాడి ఫోజు చూస్తున్నాడు. అతనికి కడుపు మండిపోతోంది. ఇక రేపట్నించి తన జట్కా ఎవరూ ఎక్కరు. నిన్నటిదాకా లాంఫారం నుంచి, అడ్రోడ్డు నుంచి, యండ్రాయి నుంచి జట్కాకట్టి జాం అంటూ ఉరుకుల పరుగుల మీద వచ్చేసేవాడు. పెళ్ళిళ్ళకి తన జట్కా, పేరంటాలకు తన జట్కా, మోతుబరులకు తన జట్కా...... పోయింది...... ఆ భోగం పోయింది.

జట్కా సాయిబుకి దుఃఖం గొంతులో కొచ్చింది. బస్సు దగ్గర జనం ఎక్కువ లేరు. సందులోంచి జట్కా ముందుకి నడిపాడు. బస్సు పక్క నుంచి జట్కా పోనిస్తూ 'ఛల్ రే బేటా ఛల్' అని చంద్రకోలతో బస్సు మీద ఒక్క పీకు పీకాడు. ఆ మోతకి ముసలి గుర్రం చెంగున ఎగిరి పరుగెత్తింది.